పాయిజన్‌సాగర్


జీడిమెట్ల ఫాక్స్‌సాగర్

విచ్చలవిడిగా విష రసాయనాలను వదులుతున్న పరిశ్రమలు

- రసాయనాల గాఢతకు ఫాక్స్‌సాగర్‌లో చనిపోతున్న చేపలు
- నీటిపారుదల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందన కరువు


గాఢతకు పెద్దసంఖ్యలో చనిపోయిన చేపలు

కుత్బుల్లాపూర్: ఒకప్పుడు పంట పొలాలకు నీరందించే ఆ చెరువులో ఇప్పుడు కలుషిత జలాలు కలుస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు అలుగు పారడంతో ఇదే అదనుగా భావించిన రసాయన పరిశ్రమల యాజమాన్యాలు విష రసాయనాలను చెరువులోకి వదులుతున్నారు. దీంతో వారం రోజులుగా చెరువులో ఉన్న చేపలు చనిపోయి నీటిపై తేలుతున్నాయి. దీంతో చేపలు పట్టే వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గత సంవత్సరం 2.82 లక్షల చేప పిల్లలను చెరువులో వదిలారు. ఇప్పటికే నీటిపారుదల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ వారు జీడిమెట్ల ఫాక్స్‌సాగర్ చెరువు వైపు కన్నెత్తి చూడకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దూలపల్లి పారిశ్రామికవాడ నుంచి రసాయనాలు..

జీడిమెట్ల ఫాక్స్‌సాగర్ చెరువు ఎగువ ప్రాంతంలో దూలపల్లి పారిశ్రామిక వాడ ఉంది. ఇక్కడ అనుమతులు లేని రసాయన గోధుమలు అధికంగా ఉండడం మూలంగా.. వివిధ ఉత్పత్తులు తయారు చేసే క్రమంలో నిల్వచేసిన విష రసాయనాలు వర్షం పడ్డ సమయంలో వదులుతున్నారని ప్రధాన ఆరోపణ. సుమారు 483 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు సమీపంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకుండా కట్టడి చేయాల్సిన ఇరిగేషన్ అధికారులు.. వాటి నిర్మాణాలకు పూర్తి భరోసా ఇస్తూ అందినకాడికి దండుకుంటూ వచ్చారు.

గతంలో పరిశ్రమలు సీజ్...

◆ ఈ నేపథ్యంలో విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ పుట్టగొడుగుల్లా రసాయన పరిశ్రమలు వెలువడ్డాయి. గతంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఎంవీ రెడ్డి 'సాక్షి'వరుస కథనాలతో అనుమతులు లేని పరిశ్రమలను గుర్తించి సీజ్ చేస్తూ వచ్చారు. ఆయన బదిలీ కావడంతో మళ్లీ మొదటికే వచ్చింది. సంబంధిత పీసీబీ అధికారులు అనుమతులు లేని విష రసాయనాలు వెలువడే పరిశ్రమలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నప్పటికీ వారిచ్చే మామూళ్లకు అలవాటు పడి ఇటువైపు కన్నెత్తి చూస్తున్న దాఖలాలు లేవు. దీంతో వర్షం పడ్డ.. చెరువు నిండిన సమయాల్లో నిల్వ ఉన్న రసాయనాలు చెరువులోకి వదిలి చేతులు దులుపుకుంటున్నారు. రసాయనాలు వదిలే పరిష్కరణ గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రశాంతంగా గణేశ్ నిమజ్జనం పూర్తి

మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి



కుత్బుల్లాపూర్: ప్రశాంత వాతావరణంలో గణేశ్ నిమజ్జనం పూర్తి చేసినట్లు మేడ్చల్ డీసీపీ కోటి రెడ్డి స్పష్టం చేశారు. గత 11 రోజులుగా డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ ఏసీపీలు, సీఐలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడంతో విజయవంతంగా ఈ ప్రక్రియ ముగిసిందని బుధవారం ఆయన 'సాక్షి'తో అన్నారు. గణేశ్ ఉత్సవాల నేపథ్యంలో ప్రత్యేకంగా మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారికి పలు సలహాలు ,సూచనలు ఇవ్వడం మూలంగా మొదటి తొమ్మిది రోజుల్లోనే 50 శాతం విగ్రహాలు నిమజ్జనం పూర్తి చేశామని తెలిపారు. మిగిలిన రెండు రోజుల్లో 45 శాతం విగ్రహాలు నిమజ్జనానికి తరలి వెళ్లాయని పేర్కొన్నారు.

◆ వెన్నెలగడ్డ ఎన్నా చెరువు, సూరారం లింగం చెరువు, మేడ్చల్ సుతారి చెరువు, శామీర్‌పేట్ సరస్సు, అల్వాల్ కొత్తచెరువు ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు ఏసీపీలు రాములు, శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు సీఐలు ఎప్పటికప్పుడు నిమజ్జనం జరుగుతున్న సందర్భాల్లో బందోబస్తు ఏర్పాటు చేయడం మూలంగా ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిమజ్జనం పూర్తి చేశామని అన్నారు.

◆ వినాయక మండప నిర్వాహకులు గణేశ్ విగ్రహాలు నెలకొల్పే సందర్భంలోనే ఆయా చెరువుల్లో నిమజ్జనం చేసేందుకు రూట్ మ్యాప్ ఇచ్చామని అన్నారు. ప్రతిరోజు సెక్టార్ ఎస్ఐలు దగ్గరుండి సిబ్బందితో వారిని ఆయా చెరువుల వద్దకు తీసుకెళ్లి బందోబస్తు నిర్వహించారని తెలిపారు. ఈ ఏడాది ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఒక ప్రణాళిక ప్రకారం నిమజ్జనం పూర్తి చేశామన్నారు. నిమజ్జనం సందర్భంగా తమతో భాగస్వాములుగా ఉన్న గణేశ్ ఉత్సవ మండప నిర్వాహకులతో పాటు ప్రతి ఒక్క పోలీస్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

లోక్ అదాలత్‌తో సత్వర పరిష్కారం


ఇన్స్‌పెక్టర్ గడ్డం మల్లేష్..

జీడిమెట్ల: క్షణికావేశం, కోపంలో చేసిన తప్పుల వలన నమోదు అయిన కేసుల నుండి విముక్తి పొందాలంటే లోక్ అదాలత్ ఉత్తమమైన మార్గమని జీడిమెట్ల ఇన్స్‌పెక్టర్ గడ్డం మల్లేష్ అన్నారు. సుప్రీం కోర్టు ఆఫ్ ఇండియా ప్రవేశ పెట్టిన లోక్ అదాలత్‌తో ద్వారా త్వరగా కేసులను పరిష్కరించుకోవచ్చని ఆయన బుధవారం ఓ ప్రకటలనలో సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే లోక్ అదాలత్‌తో పాటు ప్రతి శనివారం అన్ని కోర్టుల్లో లోక్ అదాలత్ ఉంటుందని ఆయన అన్నారు. రాజీ మాత్రమే రాజమార్గమని ఇన్స్‌పెక్టర్ పేర్కొంటూ బంధువుల, స్నేహితులు, భార్యభర్తలు కలవాలనుకుంటే లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని సీఐ మల్లేష్ కోరారు.

ఐలా.. ఇలా ఐతే ఎలా.?

నాలాలో పేరుకుపోతున్న వ్యర్థాలు, రసాయనాలు

- ఏస్వీ కోఆపరేటీవ్ సొసైటీలో కంపు కొడుతున్న నాలా
- రోడ్డుపై వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే..
- పట్టించుకోవని ఐలా మున్సిపల్ అధికారులు
- అధికారులపై మండిపడుతున్న పారిశ్రామికవేత్తలు


దుర్వాసనకు ముక్కు మూసుకుని వెళ్తున్న వ్యక్తి


నాలా నీటిపై తేలియాడుతున్న వ్యర్థ రసాయనాలు

జీడిమెట్ల: నాలా నుంచి ఘాటైన రసాయనాల దుర్వాసన వెలువడుతున్నా ఐలా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీడిమెట్ల ఫేజ్–2 నుంచి ఏస్వీ కో–ఆపరేటీవ్ సొసైటీ వెళ్లే రోడ్డులో నాలా నుంచి విపరీతమైన రసాయనాల దుర్వాసన వెలువడుతుంది. ఈ రోడ్డుగుండా ప్రతిరోజు కాలినడకన పరిశ్రమలకు వెళ్లే కార్మికులు దుర్వాసన భరించలేక ముక్కులు మూసుకుని వెళ్తున్నారు. కొంతమంది కార్మికులు దుర్వాసన భరించలేక వేరే రోడ్డు మార్గంలో పరిశ్రమలకు చేరుకుంటున్నారు. పరిశ్రమల నుంచి లక్షల రూపాయల పన్నులు వసూలు చేసే అధికారులకు నాలాలో ఉన్న వ్యర్థాలను తీయించే సమయం లేదా లేకా వారికి పట్టింపు లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఐలా మున్సిపల్ అధికారులు పట్టించుకుని నాలాలో వ్యర్థాలను తీసివేయించాలని ప్రజలు కోరుతున్నారు.

నాలా నీటిపైన అట్టలు కట్టిన రసాయనాలు..

నిర్వహణలోపం వలన నాలానీటిపైన రసాయనాలు అట్టకట్టుకుపోయి నీటిపైన తేలి ఉన్నాయి. ఆరు నెలల నుంచి రసాయనాలు నీటిపైన ఉన్నప్పటికీ ఐలా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. కొన్ని నెలలుగా రసాయనాలు అలాగే ఉండటంతో రోజురోజుకు నాలాపైన వ్యర్థాలు తేలి విపరీతమైన దుర్వాసన వెలువడుతోంది. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లాలంటేనే దుర్వాసనకు జంకాల్సిన పరిస్థితి ఏర్పడిందని కాలినడకన వెళ్లే కార్మికులు అంటున్నారు.

ఐలా మున్సిపల్ అధికారులు ఏరియాల్లో పర్యటిస్తున్నారా?

అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతంగా పేరున్న జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో మున్సిపల్ కమిషనర్ పర్యటించి వివరాలు తెలుసుకోవాలి. పారిశ్రామికవాడలో కావాల్సిన మౌళిక వసతులను మెరుగుపరిచి పారిశ్రామిక ప్రాంతానికి గుర్తింపు తీసుకురావాలి. రోడ్లు, నాలాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి కాని ఇక్కడ అధికారులు మాత్రం సగం మేర పరిశుభ్రతను పట్టించుకోవడం లేదని పారిశ్రామికవేతలు అంటున్నారు. అసలు ఐలా కమిషనర్ ఏరియాల్లో పర్యటిస్తున్నారా అని ప్రశ్నిస్తున్నారు.

ఏస్వీ కోఆపరేటీవ్ సొసైటీలో మరి దారుణం...

జీడిమెట్లలో ఒకవింగ్ ప్రాంతమైన ఏస్వీకోఆపరేటీవ్ సొసైటీలో రోడ్లు, నాలాలు, వీధిలైట్ల నిర్వహణ దారుణంగా ఉందని పారిశ్రామవేత్తలు అంటున్నారు. జీడిమెట్లలోని మిగతా ప్రాంతాలు ఒకరకంగా ఉంటే ఏస్వీకోఆపరేటీవ్ సొసైటీ మాత్రం రోడ్ల నిర్వహణలో, నాలాల మెయింటెనెన్స్‌లో దారుణంగా ఉందని పరిశ్రమలు నడిపే పారిశ్రామికవేత్తలు అంటున్నారు. ఇప్పటికైనా ఏస్వీ కోఆపరేటీవ్ సొసైటీలో పరిస్థితులు మెరుగుపడేలా అధికారులు చర్యలు తీసుకుంటారా లేదా అని పరిశ్రమల యజమానులు ప్రశ్నిస్తున్నారు.

అధికారుల తీరు మారదు..
చెత్త తొలగదు!


చెత్త ఆటోలు లోపలికి వెళ్లేందుకు వీలు లేని పరిస్థితిలో డంపింగ్ యార్డు.


డంపింగ్ యార్డు వద్ద క్యూ కట్టిన ఆటోలు

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో చెత్త సమస్య పరిష్కారం కావడం లేదు. రోజు రోజుకు పెరుగుతున్న జనాభాతో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో చెత్త సమస్య తీవ్రం అవుతోంది. దీంతో ఈ సమస్య పరిష్కారానికి అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిజాంపేట్, ప్రగతినగర్, బాచుపల్లి ప్రాంతాల్లో ప్రతి రోజు సుమారు 120 టన్నుల వరకు చెత్తను సుమారు 200 వందల వరకు ఆటోలు ప్రతి రోజు సేకరిస్తున్నారు.

◆ ప్రస్తుతం వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ఉన్నందున ఈ చెత్త సేకరణ ఎక్కువ అయ్యింది. ఇలాంటి సమయంలో చెత్తపై అధికారులు ప్రణాళికబద్ధంగా వ్యవహరించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. అధికారులు చెత్త సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేయకపోవడంతోనే సమస్య రోజురోజుకు జఠిలం అవుతోందని వివిధ కాలనీల ప్రజలు వాపోతున్నారు. ఇక్కడ నెలకొన్న సమస్యను పరిష్కరించాలని ఆటో కార్మికులు మున్సిపల్ కమిషనర్ సౌజన్యను కలిసి వినతి పత్రం అందజేశారు.

చెత్త డంపింగ్‌కు కండిషన్‌లు..

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో చెత్తను డంపింగ్ చేసేందుకు చెత్త ఆటో కార్మికులకు అధికారులు కండిషన్‌లు పెట్టడం వల్ల గంటల తరబడి చెత్త డంపింగ్‌కు వచ్చిన ఆటోలు రోడ్డుపైనే నిలబడి వేచి ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. ఒక్కో ఆటోకు సమారు రెండు గంటల వరకు చెత్త డంపింగ్‌కు సమయం పడుతుండటంతో కార్మికులు కాలనీల్లో అన్ని ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో చెత్తను సేకరించలేకపోతున్నారని వివిధ కాలనీల ప్రజలు పేర్కొంటున్నారు.

ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు...

ప్రతి రోజు డంపింగ్ యార్డు వద్ద ప్రధాన రోడ్డుపై ఆటోలు గంటల తరబడి చెత్తను డంప్ చేసేందుకు వేచి ఉండటంతో రోడ్డు మొత్తం వాహనాలతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. నిజాంపేట్ నుంచి గండిమైసమ్మ రోడ్డు, ప్రగతినగర్, సాయినగర్, రాజీవ్ గృహకల్ప వైపు రాకపోకలు సాగించేందుకు వాహనాలు డబుల్ బెడ్ రూమ్‌ల సముదాయం డంపింగ్ యార్డు నుంచే రాకపోకాలు సాగించాలి. ఇలాంటి సందర్భంలో స్కూల్ బస్సులు, ఇంజనీరింగ్ కాలేజీ బస్సులు, ఇతర వాహనాలు ఎక్కువగా ఇదే రోడ్డులో వస్తుండటంతో ట్రాఫిక్ జ్యాం అవుతోంది. ప్రజల విలువైన సమయం సైతం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెత్తను తొలగించడం లేదు...

ప్రతి రోజు డంపింగ్ యార్డులో వేసిన చెత్తను ఇక్కడి నుంచి జవహర్ నగర్ డంపింగ్ యార్డుకు అధికారులు తరలించాల్సి ఉంది. కానీ ఇది పూర్తి స్థాయిలో జరగకపోవడంతో టన్నుల కొద్ది చెత్త డంపింగ్ యార్డులో పేరుకుపోయి. పరిసర ప్రాంతాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులను కల్గిస్తుంది. ప్రతి రోజు సేకరించే చెత్తను సైతం ఎక్కడ వేయాలో తెలియని పరిస్థితి ప్రస్తుతం నెలకొందని ఆటో కార్మికులు వాపోతున్నారు. చెత్తను డంపింగ్ యార్డులోకి ఆటోలో తీసుకువెళ్లేందుకు కార్మికులు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి ఉంది. ఒక వేళ లోపలికి పోయిన ఆటో తిరిగి బయటకు రావడానికి దారిలేకుండా చెత్త అక్కడ పేరుకు పోయిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

డంపింగ్ సమయాలు మార్చాలి...



తాము చెత్తను డంపింగ్ యార్డులో వేసేందుకు ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. దీంతో తమకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉదయం 4 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు డంపింగ్ కోసం సమయం ఇస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాము చెత్తను ఖాళీ చేసేందుకు అవకాశం ఉంటుంది.

– పరమేష్,ఆటో కార్మికుడు

ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



తాము ప్రతి ఇంటింటికి ప్రతి రోజు తిరిగి చెత్తను సేకరిస్తున్నాం. దీంతో తమకు ఆటోకు ఖర్చులు, డీజిల్ ఇతర ఖర్చులు ఎక్కువగా అవుతున్నాయి. అధికారులు తమ గురించి ఆలోచించి ప్రతి నెల నెల ఇంటింటి నుంచి కనీసం రూ. 100 అయిన ఇప్పించే ప్రయత్నం చేస్తే తమకు కొంత వెసులుబాటు ఉంటుంది. మాకు ఎలాంటి ఇతర ఆదాయ వనరులు లేవు. అధికారులు మా పరిస్థితిని సైతం అర్థం చేసుకోవాలి.

– రంగస్వామి


చెత్త ఆటో కార్మికుల సమస్యలపై కమిషనర్ సౌజన్యను కలిసిన ఆటో కార్మికులు

కాలనీల అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌గౌడ్


దండమూడి ఎన్‌క్లేవ్ కమిటీ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: సంక్షేమ సంఘాలు కాలనీల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ దండమూడి ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు బుధవారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. కమిటీ సభ్యులను సత్కరించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. సభ్యులంతా ఐకమత్యంగా ఉంటూ కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని, తన సహాయం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. అధ్యక్షుడు కిరణ్ కుమార్, జనరల్ సెక్రెటరీ వేణుగోపాల్, కోశాధికారి నాగరాజు పుప్పాల, ఇందిరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలో నెలకొన్న సమస్యలపై జర్నలిస్టులు ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇప్పటికే జర్నలిస్టు కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, మంచినీటి వంటి వసతులను కల్పించామని, త్వరలోనే కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, పిల్లల పార్కు, చెర్ల ఎల్లమ్మ ఆలయానికి రోడ్డు వంటి అభివృద్ధి పనులను చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జర్నలిస్ట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆస్కాని మారుతి సాగర్, జర్నలిస్టులు లాలయ్య, దేవేందర్, కృష్ణారావు, మారుతికుమార్, గోవిందరావు, గణేష్, రమేష్, శ్రీనివాసరావు, జగదీష్ గుప్తా, మల్లికార్జున్, జీతయ్య తదితరులు పాల్గొన్నారు.

మేయర్ కుటుంబానికి పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రాజు

నిజాంపేట్: నిజాంపేట్ మేయర్ కొలన్ నీలా రెడ్డి, సీనియర్ నాయకుడు గోపాల్‌రెడ్డిని బుధవారం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పరామర్శించారు. ఇటీవల గోపాల్‌రెడ్డి మాతృమూర్తి కొలన్ కాంతమ్మ మృతి చెందింది. ఈ నేపథ్యంలో బాచుపల్లిలోని హిల్‌కౌంటీలోని వారి నివాసానికి శంభీపూర్ రాజు వెళ్లి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కార్పొరేటర్లు గాజుల సుజాత, బాలాజీ నాయక్, కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగారాయప్రసాద్ ఉన్నారు.

ప్రగతి నగర్‌లో మెగా హెల్త్ క్యాంప్

నిజాంపేట్: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రగతినగర్‌లోని ఇన్‌కాయిస్‌లో ఉద్యోగులకు మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. రెనోవా హాస్పిటల్స్ సౌజన్యంతో నిర్వహించిన ఈ క్యాంప్‌లో సిబ్బందికి బీపీ, డయాబెటీస్, ఈసీజీ, కంటి, పంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌కాయిస్ సిబ్బంది మురళీకృష్ణ, కిరణ్ కుమార్, రోహిత్ కుమార్, దాసరి ప్రసాద్ పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

సుభాష్‌నగర్: అంగన్‌వాడీల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు తప్పనిసరిగా తీసుకోవాలని సీడీపీఓ రేణుక అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ సూరారం కాలనీ లూయిస్ బ్రెయిన్ భవన్‌లో బుధవారం పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. సామూహిక సీమంతాలు చేశారు. ఆరు నెలలు పూర్తి చేసుకున్న చిన్నారులకు అన్నప్రాసన, రెండు సంవత్సరాలు నిండిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అదేవిధంగా దుండిగల్ మున్సిపల్ బాదురుపల్లి శ్రీరామ్‌నగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో టీచర్ ప్రేమ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సీడీపీఓ శారద ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం

సుభాష్‌నగర్: టీపీసీసీ పిలుపు మేరకు కాంగ్రెస్ నాయకులు గాజులరామారంలో బుధవారం ప్రధాని నరేంద్రమోదీ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్నారెడ్డి మాట్లాడుతూ.. ఏఐసీసీ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై కొద్ది రోజులుగా బీజేపీ, శివసేన నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రషీద్ బేగ్, రషీద్, కృష్ణగౌడ్, లాల్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలంలో వెలిసిన నిర్మాణాల కూల్చివేత పరంపర కొనసాగుతూనే ఉంది. గాజులరామారం డివిజన్ కైసర్ నగర్‌లోని సర్వే నెంబర్ 342 ప్రభుత్వ స్థలంలో వెలిసిన 2 బేస్‌మెంట్లు, 2 ప్రహరీలను కుత్బుల్లాపూర్ తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో బుధవారం కూల్చివేశారు.

పార్కు స్థలాన్ని విక్రయించిన వారిపై కేసు నమోదు

దుండిగల్: ఫోర్జరీ డాక్యుమెంట్లతో పార్కు స్థలాన్ని విక్రయించిన వ్యక్తులపై దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. దుండిగల్ మున్సిపల్ మల్లంపేట్‌లోని అల్లూరి విజయరామరాజు అనే వ్యక్తి కేవీఆర్ వెంచర్ పేరులో ప్లాట్లు చేసి పలువురికి విక్రయించారు. ఇటీవల వెంచర్‌లో పార్కు కోసం వదిలిన స్థలాన్ని నరేష్, శివ అనే వ్యక్తులు తప్పుడు పత్రాలు సృష్టించి శ్రీకాంత్ సాహు అనే వ్యక్తికి విక్రయించారు. దీనిపై సమాచారం అందుకున్న విజయరామరాజు బుధవారం దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదు

కుత్బుల్లాపూర్: మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెబుతామని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. బుధవారం గాజులరామారంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. సీఎం రేవంత్‌రెడ్డి, కూన శ్రీశైలంగౌడ్ పై మరోసారి నోటికొచ్చినట్టు మాట్లాడితే గల్లీలో తిరగనీయబోమని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు బొడ్డు వెంకటేశ్వరరావు, పాలకృష్ణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నారెడ్డి, నాయకులు గుంజ శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ రంగారావు, డీసీసీ ఉపాధ్యక్షులు శ్రవణ్, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణాగౌడ్, బుచ్చిరెడ్డి, కూన రఘు పాల్గొన్నారు.